



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

నూతన పంట సాగు అమలుకు చర్యలు

- కలెక్టర్ కోటేశ్వరరావు - జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఆదోని ప్రాంతంలో వచ్చే ఖరీఫ్ నుండి నూతన పంటసాగు విధానాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంటెన్స్ క్రాపింగ్, డబుల్ క్రాపింగ్ వంటి నూతన పంట సాగు విధానాలను ఖరీఫ్ నుంచి అమలు చేసేందుకు వ్యవసాయ అధికారులు సమాయత్తం కావాలని ఆదేశించారు. భూమి, అక్కడ ఉన్న సహజ పరిస్థితులు, సంప్రదాయక పంట సాగు విధానాలను దృష్టిలో ఉంచుకుని క్లస్టర్ బేస్డ్‌గా నూతన పంట సాగు విధానాల అమలుకు ఆయా ప్రాంతాల రైతులతో అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. ఆదోని ప్రాంతంలో గుర్తించిన బీడు భూముల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో కమ్యూనిటీ విధానంలో పశు గ్రాసం పెంపకానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుంగభద్ర నదీ పరీవాహక మండలాల్లో ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేసి సూక్ష్మ సేద్యం అమలుకు వీలుగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి ఒక ప్లాంట్ హెల్త్ డయాగ్నొస్టిక్ సెంటర్ ఏర్పాటుకు అధికారి వరలక్ష్మిని ఆదేశించారు. చిన్న, సన్న కారు రైతులు భరించే విధంగా గ్రీన్ హౌజ్ టెక్నాలజీ కింద షెడ్ నెట్‌లను మరిన్ని మంజూరు చేయాలన్నారు. క్యాబేజీ, క్యాప్సికమ్, స్వీట్ పొటాటో, క్యారట్ వంటి ఉద్యాన పంటల సాగును జిల్లాలో విరివిగా ప్రోత్సహించాలని సూచించారు. ఆర్‌బికె స్థాయిలో ఉల్లి స్టోరేజ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రామచంద్రయ్య, వ్యవసాయ శాఖ ఎడి లు, మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించాలి : ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ పి.కోటేశ్వర రావు అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్ పి.కోటేశ్వర రావు మాట్లాడుతూ సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ వద్ద ఐరన్ బ్యారికేడింగ్ పనులు పూర్తి చేయలేదని డిఎస్‌పి, డిటిసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకరాగ ద్విచక్ర వాహనాలు సంతోష్ నగర్ ఫ్లై ఓవర్ మధ్యలో ప్రవేశించకుండా ఐరన్ బ్యారికేడింగ్ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే 44 నందు సోలార్ లైట్లు 8 చోట్ల ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ హైవే అధికారులు తీసుకొని వచ్చారు. ఓర్వకల్లు జగనన్న కాలనీలకు వెళ్లేందుకు అప్రోచ్ రోడ్డు నేరుగా ఉందని అలా కాకుండా సర్వీసు రోడ్డు ద్వారా కాలనీలకు అప్రోచ్ రోడ్డు కల్పించేందుకు ట్రాఫిక్, రవాణ, హౌసింగ్ శాఖ వారు కలిసి తనిఖీ చేయాలన్నారు. బళ్ళారి చౌరస్తా ప్రాంతంలో రోడ్ల విస్తరణ పనులకు టెండర్ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. నగరంలో సిసి కెమెరాల మరమ్మతులు వచ్చే సమావేశం నాటికి పూర్తి చేయాలన్నారు. ముఖ్యమైన ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా వాహనదారులకు ఆడియో సిస్టం ద్వారా అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, ఆర్టిఓ రమేష్, ఆర్టీసి అధికారులు, మున్సిపల్ సిబ్బంది, నేషనల్ హైవే కర్నూలు, అనంతపురం జిల్లాలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు



సమావేశానికి హాజరయిన అధికారులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం కర్నూలు కలెక్టరేట్ ఎదుట యూనియన్ నాయకులు ఎం.మోహన్ అధ్యక్షతన ధర్నా చేశారు. ఎండి .అంజిబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, క్యాబ్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.18500 ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 14 నుండి 21 వరకు జరుగుతున్న శాసనసభ సమావేశాలలో మున్సిపల్ కార్మికుల సమస్యల గురించి చర్చించాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ కార్మికులందరికీ రెగ్యులర్ చేస్తానని వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా వాగ్దానం అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలు 90శాతం అమలు చేశామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. శాసనసభ సమావేశాల్లో మున్సిపల్ కార్మికుల సమస్యల గురించి చర్చించాలని, లేదంటే మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతారని హెచ్చరించారు. సిఐటియు కర్నూలు న్యూ సిటీ కార్యదర్శి సాయిబాబా, ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమీజాబి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుధాకరప్ప, నగర అధ్యక్షులు ఏసు, ఆటో యూనియన్ నాయకులు రాధాకృష్ణ, మెహమూద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, శాంతన్న, తిక్కయ్య, బతకన్న, అచ్చమ్మ, సువర్ణమ్మ, దానమన్న, గోపాల్, అరవిందు, ప్రభాకర్, పటాన్ పాల్గొన్నారు.

టీచర్ ఎమ్మెల్సీగా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్


పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎంవి.రామచంద్రా రెడ్డిని విజేతగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి,అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ప్రకటించారు. శుక్రవారం జెఎన్‌టియు వర్సిటీలో జరిగిన ఓట్ల లెక్కింపులో గెలుపొందాక రామచంద్రారెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ 12 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన ఎన్నికలో ప్రాథమిక ఓట్ల బదిలీ చేస్తూపోగా చివరికి ఇద్దరు అభ్యర్థులు ఎంవి.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి పోటీలో నిలిచారన్నారు. ఈ ఎన్నికలో ప్రాధాన్యత ఓట్ల బదిలీ అనంతరం సైతం ఎవరికీ 50 శాతం పైగా ఓట్లు దక్కలేదన్నారు. నిబంధనల ప్రకారం అత్యధిక ఓట్లు సాధించిన ఎంవి.రామచంద్రారెడ్డిని విజేతగా ప్రకటించామని తెలిపారు. సంపూర్ణ ప్రాధాన్యత ఓట్ల బదిలీ అనంతరం ఎంవి. రామచంద్రా రెడ్డి 10,787 ఓట్లతో గెలుపొందారు. సమీప ప్రత్యర్థి ఒంటేరు శ్రీనివాసులు రెడ్డికి 10,618 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 25,272 ఓట్లు పోలవ్వగా, వాటిలో 3,867 ఓట్లు చెల్లని ఓట్లు,ప్రాధాన్యత బదిలీ అనంతరం విలువ కోల్పోయిన ఓట్లుగా మిగిలాయి.

20న కాటికాపరుల చలో విజయవాడ

- కెజిబిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఆనంద్ బాబు

ప్రజాశక్తి-కోడుమూరు

తరతరాలుగా సమాజానికంతా ఉపయోగపడే వృత్తి ని చేస్తున్నా.. కాలే కడుపులతోనే జీవనం కొనసాగిస్తున్న కాటికాపరులంతా సమస్యల పరిష్కారానికి చలో విజయవాడ తరలిరావాలని కాటికాపరి గుంతలుతీసే బేగరుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎండి. ఆనంద్ బాబు కోరారు. శుక్రవారం కోడుమూరు సుందరయ్య భవన్‌లో కెజిబిఎస్ మండల కమిటి సమావేశం మండల కార్యదర్శి కృష్ణాపురం ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించారు. కెజిబిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఎండి. ఆనంద్ బాబు మాట్లాడుతూ రోజు వారిగా ఎంపతచెప్పినా పట్టించుకోని ఈ పాలకులు, నోట్లో నాలుక లేని వాళ్లుగా ఉంటున్న కాటికాపరుల సమస్యలు ఎప్పుడు పట్టించుకుంటారని ప్రశ్నించారు. మన సమస్యలపై గళమెత్తాల్సిన సమయం ఆసన్న మయిందని అన్నారు. మనమంతా ఐక్యమై మార్చి 20న విజయవాడలో జరిగే స్మశానవృత్తి దారుల మహా ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అయన కోరారు. కాటికాపరి గుంతలుతీసే బేగరుల సంఘం మండల నాయకులు ఇమ్మానియేల్, వీరాస్వామి, బొజ్జన్న, ప్రకాశం, మాదన్న, మద్దిలేటి, రంగన్న, బాలరాజు, సుధాకర్, చంద్ర, సోమన్న, విజయ్‌కుమార్, ఎన్.మద్దిలేటి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

- ప్రజాసంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన కార్మిక కర్షక భవన్‌లో ప్రజాసంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, సిఐటియు జిల్లా సీనియర్ నాయకులు బి.రామాంజనేయులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కార్మికులు కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం మూడు సంఘాలు కలిపి చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కనీస పెన్షన్ రూ.10000 ఉండాలని, రైతులకు మద్దతు ధర కల్పించాలని పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలన్నారు. కల్తీ విత్తనాల ద్వారా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులకు రోజుకు కనీస వేతనం రూ. 600 ఇవ్వాలని, 60 సంవత్సరాలు దాటిన వ్యవసాయ కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 12 రకాల వస్తువులను ప్రజలకు ఉచితంగాపంపిణీ చేయాలని , సంపన్నులపైన సంపద పన్ను విధించాలని తదితర డిమాండ్లతో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో అన్ని ప్రాంతాలలో ప్రచార సభలు నిర్వహించాలని మోటార్ సైకిల్ ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహించాలని నిర్ణయించారు. దళాలుగా ఏర్పడి ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించాలని కార్యకర్తలను కోరారు. కర్నూలు జిల్లా నుండి పెద్ద సంఖ్యలో కార్మికులు కర్షకులు చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యం: ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పోలీసు సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారమే ప్రాధాన్యతగా పోలీసు గ్రీవెన్స్ డేను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది మొత్తం 27 మంది బదిలీలు, వ్యక్తిగత, స్పౌష్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్‌పికి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్‌పి సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. డిపిఒ ఎఒ సురేష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్



ఎపి అమరావతి జెఎసి ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎపిజెఎసి ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపిజెఎసి అమరావతి, కర్నూలు జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన నిరసన ఉద్యమం శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు చేయి చేయి కలుపుదాం ఉద్యమ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎపిజెఎసి అమరావతి–కర్నూలు జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు పేర్కొన్నారు. జిల్లా అసోసియేట్ చైర్మన్ నాగరమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కెవై.కృష్ణ, ఇతర నాయకులు మాట్లాడుతూ జీతాభత్యాల కోసం ఎదురుచూస్తూ ఉద్యోగుల ఆత్మ గౌరవాన్ని అప్పుల వాళ్ల దగ్గర తాకట్టు పెట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కనీసం జీతం ఎప్పుడు వస్తుందో కూడా తెలియని పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జాతీయ అధ్యక్షులు రమణ

ఏప్రిల్ 9న గిరిజన ఉద్యోగుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి -కర్నూలు అగ్రికల్చర్

ఏప్రిల్ 9న ఆల్ ఇండియా గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగే ఆంధ్రప్రదేశ్ గిరిజన ఉద్యోగుల రాష్ట్ర సదస్సుకు జిల్లాలోని ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో హాజరయి విజయవంతం చేయాలని అఖిల భారత గిరిజన సంఘం అధ్యక్షులు రమణ సూచించారు. శుక్రవారం కర్నూలు జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బి.మద్దిలేటి అధ్యక్షతన అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పివి.రమణ మాట్లాడారు. గిరిజన ఉద్యోగులు ఐక్యంగా ఉండాలని, కర్నూలు జిల్లాలో బోగస్ ఎస్‌టి సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల మీద ఉన్నటువంటి కేసులను జిల్లా అధికారులు త్వరిత గతిన పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల జిల్లా కార్యదర్శి ఎస్ రాముడు గౌరవ అధ్యక్షులు ఎం. బద్దు నాయక్ వై.నారాయణ, కోశాధికారి జి.వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు ఈ మద్దిలేటి ,ఎం మద్దయ్య, ఎం.రోగెన్న, డాక్టర్ నాగరాజు , నంద్యాల జిల్లా నుంచి వచ్చిన డాక్టర్ శ్రీనివాసులు ,సుంకన్న , వెంకటేష్ పాల్గొన్నారు.

మార్కెట్ ధర ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు మండలంలో అవుటర్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని కర్నూలు టిడిపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ నాయుడు అన్నారు. మండల కమిటి ఆధ్వర్యంలో కర్నూలు ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయ ఎఒకు వినతిపత్రం సమర్పించారు. వెంకటేష్ నాయుడు మాట్లాడుతూ కర్నూలు మండలం బి.తాండ్రపాడు నుండి గార్గేయపురం వరకు ఔటర్ రింగ్ రోడ్డు వల్ల భూమి కోల్పోతున్న రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నా రన్నారు. నగరానికి అత్యంత సమీపంలోని ఈ గ్రామాల్లో ఒక ఎకరం విలువ రూ.కోట్లలో పలుకుతుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు కేవలం ఎకరం రూ.12 లక్షలుగా పరిహా రాన్ని నిర్ణయించడం రైతుల పొట్ట కొట్టడమే అవు తుందని అన్నారు. మార్కెట్ ధర ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, లేని పక్షంలో రైతు లందరిని కూడగట్టి పెద్ద ఎత్తున ఆం దోళన నిర్వహిస్తా మని అన్నారు. కార్యక్రమంలో గొంది పర్ల మాజీ ఎంపిటిసి ఎం.నాగరాజు, నియో జకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రెడ్డి పోగు భాస్కర్, కర్నూలు మండలం తెలుగు యువత అధ్యక్షుడు నెహ్రూ కుమార్, మండల ఐటిడిపి అధ్యక్షుడు సయ్యద్ బాషా, కర్నూలు 39వ వార్డు ఇన్చార్జి ప్రసాద్, ఉల్చాల టిడిపి సీనియర్ నాయకులు వెంకట రాముడు, మాల హనుమంతు, రహిమాన్ ఖాన్ పాల్గొన్నారు.



ఎఒకు వినతిపత్రం ఇస్తున్న బుర్రి వెంకటేష్ నాయుడు, తదితరులు

పట్టభద్రులకు కృతజ్ఞతలు : టిడిపి

ప్రజాశక్తి- సి బెళగల్ : రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ముందంజలో ఉందని ఆదరించిన పట్టభద్రుల ఓటర్లకు టిడిపి మండల కన్వీనర్ గోవింద్ గౌడ్ శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఈ అరాచక పాలనకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ప్రధానంగా అధికార మదంతో ఓటర్లకు డబ్బులిచ్చినా, టిడిపి సమగ్ర పాలనపై ప్రజలు వెన్నంటే ఉన్నారని ఇది ప్రజాస్వామ్య ప్రజల బలమని అన్నారు. ఇదే మండలంలో టిడిపి శ్రేణులు పట్టుదలతో కృషి చేస్తున్నారన్నారు.



25,26 తేదీల్లో ట్రాన్స్‌ఫోర్టు జాతాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ప్రజా, సరుకు రవాణా చేసే డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని రవాణా రంగ కార్మికులు పరిరక్షణకు కేంద్రం రూ.50,000 కోట్లు కేటాయించాలని మోటార్ ఆక్ట్ సవరణ బిల్లు రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న తారీఖున ఢిల్లీలో జరిగే మహా ధర్నా జయప్రదానికి ఈనెల 25,26 తేదీలలో జిల్లాలో జరుగు ట్రాన్స్‌పోర్టు జాతాను రవాణా రంగ కార్మికులందరూ జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్,రాధాకృష్ణ కార్మికులను కోరారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్ సిఐటియు కార్యాలయంలో ఆటో యూనియన్ రెండు నగర కమిటీల సమావేశం న్యూ సిటీ నగర ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ , సిఐటియు న్యూ సిటీ అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ మాట్లాడుతూ పార్లమెంట్లో ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న మోటార్ ఆక్ట్ సవరణ బిల్లును తీసుకువచ్చి రవాణా రంగంపై మోయలేని భారం మోపిందని అన్నారు. మోటార్ ఆక్ట్ సవరణ బిల్లు పార్లమెంట్లో ఆమోదించడం వల్ల అనేక రాష్ట్రాల్లో భారీగా చలానా ఫీజులు జరిమానాలు పెరగడం వల్ల రవాణా రంగాన్ని పరిరక్షించుకోలేక అనేకమంది వాహన యజమానులు వాహనాలను అమ్ముకుంటున్నారన్నారు. వీటినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న అనేకమంది వాహన డ్రైవర్లు ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు. ఈ చలానా పేరుతో జరిమానాల పేరుతో అధిక మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేస్తూ రాష్ట్ర ఖజానాను నింపుకుంటుంది తప్ప డ్రైవర్ల సంక్షేమం కోసం వారు పడే ఇబ్బందులను ప్రభుత్వాలు గమనించడం లేదని వారు అన్నారు. రవాణా రంగాన్ని పరిరక్షించుకోకపోతే భవిష్యత్తులో ఓలా, ఓబర్, రాపిడ్ లాంటి సంస్థలకు ఈ రంగాన్ని కట్టబెట్టే ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని వీటిని తిప్పి కొట్టాలంటే ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో రవాణా రంగ కార్మికులు వేలాదిగా తరలి రావాలని, ఈ కార్యక్రమం జయప్రదం కోసం ఈ నెల 25, 26 తేదీలలో ట్రాన్స్‌పోర్టు రంగ జాతాను నిర్వహిస్తున్నామన్నారు. ఈ జాతా జయ ప్రధానికి ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ అధ్యక్ష ,కార్యదర్శులు రవి, పి.మహమూద్ న్యూ సిటీ అధ్యక్షులు ఎస్. హుస్సేన్ వలి.ఆటో యూనియన్ నగర నాయకులు నాగరాజు, కుమార్, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ



యునాని వైద్య శాలను సందర్శించిన టిజి.భరత్

యునాని వైద్యశాల అభివృద్ధికి కృషి

టిడిపి కర్నూలు ఇంచార్జి టిజి.భరత్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

యునాని వైద్యశాల అభివృద్ధికి టిజివి సంస్థ తరుపున అవసరమైన సహకారం అందిస్తానని ఆ సంస్థల చైర్మన్, కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి టిజి.భరత్ తెలిపారు. నగరంలోని యునాని వైద్యశాలతో పాటు కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. అన్ని విభాగాలను పరిశీలించి అక్కడి వైద్యులు, ప్రిన్సిపల్ తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యునాని వైద్యశాల పాతబస్తీ వాసులకు వరం లాంటిదన్నారు. పేద ప్రజలందరూ ఇక్కడ వైద్య సేవలకు వస్తుంటారన్నారు. ఈ వైద్యశాల అభివృద్ధికి టిజివి సంస్థల తరుపున ఎలాంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో తక్షణ సహాయం మేరకు సాదారణ రోగులకు అవసరమైన బెడ్లు, లేబర్ రూమ్‌లో బెడ్స్ ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, ఇబ్రహీం, ఊట్ల రమేష్, మెహబూబ్ బాషా పాల్గొన్నారు.

100 రోజుల పని తప్పనిసరి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని ఉపాధి కూలీలకు 100 రోజుల పనిని తప్పనిసరిగా కల్పించాలని ఎంపిడిఒ రాముడు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పనులపై అవగాహన కల్పించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉపాధి ద్వారా 90 రోజులను కల్పించాలని అన్నారు. ఆధార్ సీడింగ్ వేగవంతం చేయాలని తెలిపి ప్రతి ఉపాధి కూలికి రోజు రూ.257 వచ్చేలా చూడాలని పేర్కొన్నారు. ఎపిఒ లక్ష్మన్న,ఇసి పృధ్వి,సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు పది ఉత్తీర్ణత కీలకం : డిఆర్‌డిఎపిడి

ప్రజాశక్తి-సి బెళగల్

ఉన్నత విద్యకు పదవ తరగతి ఉత్తీర్ణత కీలకమని డిఆర్‌డి ఎపిడి వెంకటసుబ్బయ్య అన్నారు. శుక్రవారం బెళగల్ లోని కెజిబివి తనిఖీ చేసి పది బాలికలతో ముచ్చటించారు. ఉన్నత విద్యకు పది ఫలితాలు కీలకమని 100 శాతం ఉత్తీర్ణతకు పాటుపడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల్లో మాస్ కాపింగ్ పాల్పడవద్దని ఇష్టపడి కష్టపడి చదివితే భవిష్యత్తు మీదేనన్నారు. ప్రత్యేక తరగతులను సక్రమంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతయినా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఒ జ్యోతి, సిబ్బంది కూడా ఉన్నారు.

బాధ్యతతో విధులను నిర్వర్తించండి

- తహాశీల్దార్ లక్ష్మీనారాయణ


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న తహాశీల్దార్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం ఏ విధులైతే అప్పజెప్పిందో ఆ విధులను బాధ్యతగా నిర్వర్తించాలని తహాశీల్దార్ లక్ష్మీనారాయణ సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం చిప్పగిరి ప్రభుత్వ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం చిప్పగిరి సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులను పరిశీలించి, సచివాలయ సిబ్బంది పనితీరును పంచాయతీ కార్యదర్శి నాగభూషణంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. సచివాలయానికి వచ్చే ప్రతి దరఖాస్తుకూ కూడా అలసత్వం వహించకుండా పరిష్కారం చూపాలన్నారు. పరిధిలో లేనప్పుడు మండల అధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టుకోవడం మంచిది కాదన్నారు. ఈనెలాఖరు నాటికి ఇంటి గుత్తలు, నీటి గుత్తలు వంద శాతం పూర్తి చేయాలన్నారు. విఆర్ఒ తిమ్మప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ, సుంకులమ్మ దేవర

ప్రజాశక్తి - హొళగుంద


నాయకులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

మండలంలోని కోకిలతోట గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మ దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ముందుగా మేటి కుంభోత్సవం నిర్వహించారు. అనంతరం ఇరువురి దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ దేవర నిర్వహించడం వల్ల సమృద్ధిగా వర్షాలు కురిసి, పంట పొలాలు సస్యశ్యామలమై గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉంటారని నమ్మకం. దేవరలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పాల్గొంటారు. వచ్చిన భక్తులకు చుట్టుపక్కల గ్రామస్తులకు కోకిలతోట గ్రామస్తులు ప్రతి ఇంటి ముందు అన్నదానం ఏర్పాటు చేశారు.

మారెమ్మ, సుంకులమ్మను దర్శించుకున్న మంత్రి సోదరులు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, వైసిపి ఆలూరు తాలూకా బాధ్యులు నారాయణస్వామి దేవరకు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా పాల్గొని మారెమ్మ, సుంకులమ్మను దర్శించుకున్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాలను అదుపు చేయలేక పోయిన పోలీసులు

దేవర సందర్భంగా వాహనాలు అధిక సంఖ్యలో తరలివచ్చాయి. వాహనాలను అదుపు చేయడంలో పోలీసులు విఫలమయ్యారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒక గంట పాటు ట్రాఫిక్ జామ్ అయి భక్తులు, గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

చిరు వ్యాపారులను

ఇబ్బందులకు గురి చేయడం తగదు

- ఎంఆర్‌పిఎస్ ఆదోని ఇన్‌ఛార్జీ గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని


కమిషనర్‌కు విన్నవించుకుంటున్న చిరు వ్యాపారులు

చిరు వ్యాపారులను మున్సిపల్ అధికారులు ఇబ్బందులకు గురి చేయడం తగదని ఎంఆర్‌పిఎస్ ఆదోని ఇన్‌ఛార్జీ బండారి గిడ్డయ్య, పట్టణ ఇన్‌ఛార్జీ గుమ్మల బాలస్వామి మాదిగ విమర్శించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో బంకుల తొలగింపునకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కుటుంబ పోషణ కోసం పుట్ పాత్‌పై చిరు వ్యాపారం చేసుకుంటున్న వారిని తొలగిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించకుండా వ్యాపారం చేసుకునే వారికి సహకరించాలని కోరారు. పుట్‌పాత్‌లపై చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారిని మున్సిపల్ సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. ఆదోని రైల్వే స్టేషన్ రోడ్డు పక్కన డబ్బాల్లో ట్రాఫిక్‌కు, జనాలకు ఎలాంటి అంతరాయమూ కలిగించకుండా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. 20 ఏళ్ల నుంచి అదే రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. మహాజన సోషలిస్టు పార్టీ ఆదోని మండల ఇన్‌ఛార్జీ పిఎస్.వీరేష్, ఎంఆర్‌పిఎస్ పట్టణ నాయకులు మణికంత, మండల నాయకులు దిబ్బనకల్లు హుసేనప్ప, టౌన్ నాయకులు ఈరన్న, చిరు వ్యాపారులు ఉన్నారు.

20న విజయవాడలో కాటికాపరుల మహాధర్నా

- జయప్రదం చేయండి - కెజిబిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఆనంద్ బాబు

ప్రజాశక్తి - గోనెగండ్ల


గోనెగండ్లలో మాట్లాడుతున్న ఆనంద్ బాబు

శ్మశానంలో గుంతలు తీసే కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న విజయవాడలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. శుక్రవారం గోనెగండ్లలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందుభాగంలో సమావేశం నిర్వహించారు. కెజిబిఎస్ మండల అధ్యక్షులు సల్వాది మునిస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కెజిబిఎస్ రాష్ట్ర కన్వీనర్ ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్ మాట్లాడారు. సాధారణ చావులే కాకుండా ఆకస్మిక మరణాల ద్వారా చనిపోయిన వ్యక్తుల మృతదేహాలు కుళ్లినా, ఉబ్బినా, దుర్వాసన వస్తున్నా బరిస్తూ గుంత తీసి పూడుస్తున్నారని తెలిపారు. కర్రలు పేర్చి కాలుస్తున్న వారి బతుకులకు మాత్రం ఎలాంటి భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరందరికీ కలిపి ఎంతో కొంత శ్మశాన స్థలాలు ఉన్నా, చనిపోయిన పూడ్చే దళితులకు మాత్రం పూడ్చేందుకు స్థలాలు లేవన్నారు. ప్రతి దళితవాడకూ రెండెకరాల శ్మశాన స్థలం కేటాయించాలని జిఒ 1235 సాధించి 20 ఏళ్లు పూర్తయినా నేటికీ సెంటు స్థలం కేటాయించలేదని విమర్శించారు. శ్మశానంలో పని చేసే వృత్తిదారులందరినీ 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి ఉపాధి ఇవ్వాలని కోరారు. అన్ని సమస్యలు పరిష్కరించాలని ఈనెల 20న విజయవాడలో చేపట్టే మహా ధర్నాకు అత్యధికంగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. మండల నాయకులు సలువాది పెద్ద మునిస్వామి, చిన్న రంగన్న, తిమ్మప్ప, సుంకన్న, కన్నయ్య, చిన్నస్వామి, మునిస్వామి, దావీదు, జయరాజు, శంకరయ్య, సుంకన్న, రత్నమయ్య, రాజు, లక్ష్మన్న, పేతూరయ్య పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న కెవిపిఎస్ జిల్లా ఉపకార్యాలయంలో కెజిబిఎస్ నందవరం, ఎమ్మిగనూరు మండలాల సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ పట్టణ కార్యదర్శి ఎస్.ఆంథోని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాటికాపరి గుంతలు తీసే బేగరుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎమ్‌డి.ఆనంద్‌బాబు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం, జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు, మండల అధ్యక్షులు చిన్నప్ప, కెజిబిఎస్ నందవరం మండల అధ్యక్షులు పూజారి నాగప్ప మాట్లాడారు. ఎక్కడ, ఏ రూపంలో, ఎవరు మృతి చెందినా పేద, ధనిక తేడా లేకుండా శ్మశానంలో పూడ్చే తమ వృత్తిదారుల పట్ల ఇంకెన్నాళ్లు తేడా చూపుతారని ప్రశ్నించారు. ఈనెల 20న విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి నల్ల చొక్కా, తెల్ల పంచ, ఎర్ర కండువా, పట్టుడు కర్రతో ప్రదర్శన నిర్వహించి ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కెవిపిఎస్ పట్టణ అధ్యక్షులు గుంటెప్ప, మండల నాయకులు రాజా రమేష్, చిన్న రాజు, జయరాజు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఆనంద్ బాబు


ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న కరస్పాండెంట్లు మల్లేష్, నరేష్ ఆచారి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆస్పరి

పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని విజేత హై స్కూల్ కరస్పాండెంట్ మల్లేష్, నారాయణ ప్రైమ్ స్కూల్ కరస్పాండెంట్ నరేష్ ఆచారి, సిపిఎం మండల కార్యదర్శి హనుమంత ఆకాంక్షించారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రవి ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న 61 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పదో తరగతి నుంచే కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి పరీక్షలు రాయాలని కోరారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- 20న చలో విజయవాడను జయప్రదం చేయండి

- సిఐటియు మండల కన్వీనర్ రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ బి.రాముడు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు గోవర్ధనమ్మ, నాగలక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కంటే అంగన్వాడీలకు అదనంగా వేతనాలు అందిస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి హామీఇచ్చారని తెలిపారు. నాలుగేళ్లు పూర్తయినప్పటికీ హామీని అమలు చేయలేదని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 5లోపు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2017 నుంచి బకాయిలు చెల్లించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 20న చలో విజయవాడకు కదిలి వచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్ట్ నాయకులు అరుణ, శైలజ, లత, ప్రభావతి పాల్గొన్నారు.


సిడిపిఒకు వినతిపత్రం అందిస్తున్న అంగన్వాడీ నాయకులు

పల్లెదొడ్డిలో వడగండ్ల వాన

ప్రజాశక్తి - దేవనకొండ


గిన్నెలో వడగండ్లను చూపిస్తున్న వ్యక్తి

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో దేవనకొండ మండలంలో శుక్రవారం జోరుగా వర్షం కురిసింది. మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో వడగండ్ల వాన కురిసింది. అకాల వర్షాలతో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన వేరుశనగ పంటను కొందరు రైతులు పీకి వేయడంతో వర్షాలకు తడిసి ముద్దయ్యాయి. పశుగ్రాసం పనికి రాకుండా పోయిందని, వేరుశనగ కాయలు రంగు నల్లగా మారాయిని రైతులు వాపోయారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి

- డీఎస్పీ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - ఆదోని


మాట్లాడుతున్న డీఎస్పీ వినోద్ కుమార్

నైతిక విలువలతో కూడిన విద్యనందించి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఆదోని డీఎస్పీ వినోద్ కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం ఆదోని భాష్యం స్కూల్ వార్షికోత్సవ వేడుక జరిగింది. అంతకుముందు చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వినోద్‌కుమార్ మాట్లాడారు. అడిగింది ఇవ్వలేదని, మనస్తాపం చెంది క్షణికావేశంలో అఘాయిత్యాలకు పాల్పడుతూ తల్లిదండ్రుల ఆశలను అడియాశలు చేయడం ప్రస్తుతం జరుగుతోందని తెలిపారు. తెలిసీ తెలియని వయస్సులోనే ప్రేమ పేరుతో పారిపోయి జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని చెప్పారు. పిల్లలు ఏం చదువుతున్నారో, ఎలా వ్యవహరిస్తున్నారో అన్నదానిపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని తెలిపారు. మహనీయుల జీవిత చరిత్రను విద్యార్థులకు వివరిస్తూ ఆ బాటలో పయనించేలా తీర్చిదిద్దాలని కోరారు. ప్రిన్సిపల్ సురేంద్రబాబు, పాఠశాల సిబ్బంది భార్గవ్, అంజి, శంకర్, మాధవ్ పాల్గొన్నారు.


వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు


వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్

రాయితీ అవకాశాన్ని వినియోగించుకోండి

- మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఇంటి పన్ను బకాయిల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీ అవకాశాన్ని బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పెండింగులో ఉన్న గత ఇంటి పన్ను బకాయిలు, ప్రస్తుత సంవత్సర పన్ను ఒకేసారి 31 మార్చిలోపు చెల్లించే వారికి వడ్డీ మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు. కరోనా కష్ట కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈనెల 31లోపు పన్నులు చెల్లించి వడ్డీ మినహాయింపు లబ్ధి పొందాలని కోరారు. ఈ ఏడాది రూ.16 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటివరకు రూ.10.45 కోట్లు వసూలు అయిందన్నారు. వార్డుల వారీగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలుగా వెళ్లి వసూలుకు చర్యలు తీసుకున్నామన్నారు. పురవాసులు సహకరించాలని కోరారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించండి

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప


ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న వెంకప్ప

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని సంతమార్కెట్, ఎంపిడిఒ కార్యాలయం ముందున్న షాపింగ్ కాంప్లెక్స్ తక్షణమే ప్రారంభించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప కోరారు. శుక్రవారం ఎంపిడిఒ అల్లబకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూఅర్బన్ నిధుల రూ.1.20 కోట్లతో సంతమార్కెట్‌లోని 27 గదులు, ఎంపిడిఒ కార్యాలయం ముందు ఉన్న రూ.80 లక్షలతో నిర్మించిన కాంప్లెక్స్‌ను సంవత్సరాలు గడిచినా ప్రారంభించడం లేదని తెలిపారు. పెండింగులో ఉంచి పంచాయతీకి, మండల అభివృద్ధికి నష్టం కలిగిస్తున్నారని చెప్పారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో అధికారులు విఫలం చెందారన్నారు. వచ్చే నెలలోపు ప్రారంభించకుంటే జనసేన ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. జనసేన నాయకులు మహేష్, అరవింద్, మహానంది, బడేసాహెబ్, ఖలీల్, సాయికృష్ణ పాల్గొన్నారు.

24న సంతమార్కెట్ వేలం పాటలు...

- పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్

ప్రజాశక్తి - ఆలూరు

ఈనెల 24న ఆలూరులోని వారపు, దినసరి మార్కెట్ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆలూరు పంచాయతీ కార్యదర్శి కృష్ణ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూర్చే వారపు సంతమార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్, గొర్రెల మాంసం, గొర్రెల వధశాల, పశువుల మాంసం, పశు వధశాలకు రుసుం వసూలు చేసేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 1, 2023 నుంచి డిసెంబర్ 31 2024 వరకు రుసుం వసూలు చేసుకోవచ్చని చెప్పారు. గ్రామ పంచాయతీ ఆవరణలో అధికారుల సమక్షంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు పంచాయతీకి బకాయి ఉంటే అనర్హులని చెప్పారు. గెజిట్ నోటిఫికేషన్ షరతులకు లోబడి డిపాజిట్ చెల్లించి పాల్గొనాలన్నారు.

వివాహ వేడుకల్లో వెంకప్ప

- నూతన వధూవరులను ఆశీర్వదించిన జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకల్లు వెంకప్ప

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని గూళ్యం గ్రామంలో జనసేన నాయకులు లింగారెడ్డి వివాహ వేడుకకు శుక్రవారం జనసేన ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ తెర్నేకుల్ల వెంకప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వెంకప్పకు కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువా, పూలమాలతో సన్మానించారు. జనసేన నాయకులు పవన్, చంద్ర, బడేసాహెబ్, అరవింద్, మహానంది పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న వెంకప్ప

తాగునీటి పైపు లైన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం కనకవీడు గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, పంచాయతీ ఆధ్వర్యంలో పైపులైన్ పనులను ప్రారంభించారు. శుక్రవారం సర్పంచి వెంకట్రాముడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకట్రాముడు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఫెసిలేటర్ కరుణప్ప పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకట్రాముడు మాట్లాడారు. శుభ్రమైన నీరు తాగడం వల్ల అందరికీ మంచి ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. దాని వల్ల గ్రామం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రిలయన్స్ ఫౌండేషన్ వారి సేవలను గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రామారావు మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సహకరించి రిలయన్స్ ఫౌండేషన్ వారు చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందని తెలిపారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం ఫెసిలేటర్ కరుణప్ప మాట్లాడుతూ... రిలయన్స్ ఫౌండేషన్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి, ప్రభుత్వ వ్యవస్థలు, ప్రజలు మధ్య అనుసంధాన కర్తగా, నీటి సంరక్షణ పద్ధతులు, అవగాహన కార్యక్రమాలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీటి వసతి నిమిత్తం పైపు లైన్ పనుల విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఇంజినీరింగ్ సహాయకులు భారత్, ఆర్డిప్ సంస్థ కార్యకర్త హుసేని, ఎంపిటిసి హరిశ్చంద్ర, స్వామిదాసు, సుందర రాజు, యువ రాజు, మారెప్ప, ఆనంద్, విజయ్ పాల్గొన్నారు.



పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచి, ఎఇ

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ఎమ్‌డి.హళ్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఆదోని మధు హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికుల నుంచి మంచి స్పందన వచ్చిందని ప్రసూతి డాక్టర్ లక్ష్మి ప్రసన్న తెలిపారు. ఎమ్‌డి.హళ్లి సర్పంచి సుధాకర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. హొళగుంద మండలం పెద్దగోనేహాల్, ఇంగలదహాల్, ఎమ్‌డి.హళ్లి గ్రామాల ప్రజలు గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ వ్యాధులు, కంటి పరీక్షలు, కీళ్ల నొప్పులు, జ్వరానికి ఇతర వ్యాధులకు చిత్సలు చేయించుకున్నారన్నారు. డాక్టర్ డిటి.సుభాష్ గుండె చికిత్స నిపుణులు, డాక్టర్ బిజి.మానస కంటి వైద్య నిపుణులు, మార్కెటింగ్ మేనేజర్ సునీల్ కుమార్, గ్రామ పెద్దలు గోవిందు రెడ్డి, భీష్మ, ఈరన్న ఉన్నారు.


వైద్య శిబిరానికి హాజరయిన గ్రామ పెద్దలు, వైద్యులు


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏప్రిల్ 23న ఉచిత సామూహిక వివాహాలు

- డిహెచ్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు వీరేష్

ప్రజాశక్తి - ఆదోని

బసవ జయంతి సందర్భంగా ఏప్రిల్ 23న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, వధూవరులు సద్వినియోగం చేసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి ఆదోని నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ వీరేష్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రోడ్లు అండ్ భవనాల అతిథి గృహంలో నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 5న మాజీ ఉప ప్రధాని జగ్జీవన్ రామ్ జయంతి, 11న మహాత్మ పూలే జయంతి, 14న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి నిర్వహిస్తామన్నారు. కుల నిర్మూలన కోసం అహర్నిశలు పాటుపడిన బసవేశ్వరుడు జయంతి సందర్భంగా ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆదోని మున్సిపల్ మైదానంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సర్వ మతాలకు సంబంధించిన వివావా వయస్సు కలిగిన వారు ఏప్రిల్ 15లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వధూవరులు ఆధార్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. పెళ్లి చేసుకునే జంటలకు బట్టలు, తాళి, కాలిమెట్టలు ఇస్తున్నామన్నారు. వివాహానికి హాజరయ్యే బంధువులకు భోజన సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వారి సంప్రదాయాల మేరకు వివాహాలు చేసుకోవచ్చన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్నీ వివరాల కోసం సెల్ నెంబర్లు 9440092463, 9985744769కు సంప్రదించాలని తెలిపారు. సంఘం కార్యదర్శి కుమార్ స్వామి, మండల అధ్యక్షులు నరసప్ప, ఉపాధ్యక్షులు గిడ్డయ్య, పట్టణ కార్యదర్శి భాస్కర్, నాయకులు కరెంటు ఈరన్న, పుష్ప రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు విజయ్, ఎఐవైఎఫ్ నాయకులు రమేష్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరేష్


జెసిబితో డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న కార్యదర్శి సురేంద్ర

పారిశుధ్య నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- వైస్ ఎంపిపి నరసింహులు

ప్రజాశక్తి - చిప్పగిరి

పారిశుధ్య నిర్మూలనే ప్రభుత్వ ముఖ్య ధ్యేయమని వైస్ ఎంపిపి నంచర్ల నరసింహులు, సర్పంచి భీమా తెలిపారు. శుక్రవారం నంచర్ల గ్రామంలో సర్పంచి భీమా అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో గ్రామంలో జెసిబి సహాయంతో పారిశుధ్య పనులను చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామంలో దేవాలయం ముందు, డ్రెయినేజీ వద్ద చెత్తాచెదారం, పారిశుధ్యం ఎక్కువగా పేరుకుపోవడంతో జెసిబి సహాయంతో డ్రెయినేజీని వెడల్పు చేయించి బండలను వేయించినట్లు తెలిపారు. మున్ముందు మురుగునీరు, డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహించకుండా, డ్రెయినేజీల్లో వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి సురేంద్ర తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో నంచర్ల గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడండి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు రాముడు కోరారు. శుక్రవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ప్రతి వీధిలో కుక్కల బెడద ఉందని, వీటి వల్ల స్కూల్ పిల్లలు, చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు జోక్యం చేసుకొని ప్రజలను కాపాడాలని డిమాండ్ చేశారు. వీధుల్లో పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతున్నాయని, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే తెలంగాణ ప్రాంతంలో ఇద్దరు చిన్నారులు మరణించారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, పట్టణంలో గాయాల పాలయ్యారన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు అబ్దుల్లా, రాజు, రమేష్ కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

ఇటుక బట్టీల కాలుష్యాన్ని అరికట్టండి

- విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇటుక బట్టీల కాలుష్యాన్ని అరికట్టాలని విద్యార్థి సంఘం నాయకులు ఉదయ్ కుమార్, రాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని ప్రధాన హైవేలో ఉన్న ఇటుక బట్టీల నుంచి వచ్చే కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. ప్రధాన హైవేలో ప్రమాదాలకు ఈ ఇటుక బట్టీల నుంచి వచ్చే కాలుష్యమే కారణమని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా అనేక ఇటుక బట్టీలు పుట్టుకొస్తున్నాయని చెప్పారు. వీటి నుంచి వచ్చే కాలుష్యం వల్ల ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. విద్యార్థులు పాల్గొన్నారు.


సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు





ఆత్మకూరులో ఆందోళన నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

ప్రతిపక్షాలపై దాడులను ఖండించండి

ప్రజాశక్తి - ఆత్మకూర్

త్రిపుర రాష్ట్రంలో ప్రతిపక్షాల కార్యాల యాలపై, ఇండ్లపై బిజెపి ఆర్ఎస్ఎస్ దాడులను ఖండించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం, పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ లు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర త్రిపుర రాష్ట్రంలో ప్రతిపక్షాలపై దాడులను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 మార్చి 2వ తేదీన త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నెగ్గుతున్నట్లు ఒకవైపు ఫలితాలు ప్రారంభమైన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా బిజెపి ఆర్ఎస్ఎస్ ల దుర్మార్గమైన దాడులు మొదలైయన్నారు. ఈ దాడుల్లో ప్రతిపక్ష నాయకుల ఇండ్లపై, కార్యాల యాలపై గుంపులు గుంపులుగా దాడి చేసి దొరికిన వారిని కొట్టారన్నారు. సిఐటియుకు చెందిన సాధారణ కార్మికుల ఇల్లు ఆస్తుల దహనాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు సహితం గ్రామాలను వదిలి ఇతర ప్రాంతాలలో తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇంత దుర్మార్గంగా త్రిపుర రాష్ట్రంలో దాడులు జరుగుతున్న పోలీస్ యంత్రాంగం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. నాయకులు మల్లయ్య, శివ కుమార్, గణపతి, నూర్, నవీన్, పేత్రు, రఫీ పాల్గొన్నారు.

అకాల వర్షాల పట్ల అప్రమత్తం

- ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలు, కోల్పోయిన పశు సంపదను అంచనా వేసి నష్టపరిహార ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైఎస్ఆర్ సెంటినరీ హాలులో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి జయదేవ్ తదితర వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ, వాణిజ్య పంటలు, కోల్పోయిన పశుసంపదకు సంబంధించిన నష్టపరిహార ప్రతిపాదన సిద్ధం చేయడంతో పాటు రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాల వల్ల అప్రమత్తంగా ఉండి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించాలన్నారు. గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షానికి జిల్లాలో 4906 హెక్టార్లలో వ్యవసాయ పంటలు 313 హెక్టార్లలో వాణిజ్య పంటలు, 769 గొర్రెలు చనిపోయినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని, ఈ మేరకు బీమా ప్రీమియం వర్తింపు, నష్టపరిహార నిమిత్తం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అకాల వర్షాలు, వాతావరణ పరిస్థితులపై విపత్తు నిర్వహణ శాఖ నుండి సమాచారం తీసుకొని మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పంట, పశు నష్టాన్ని తగ్గించుకోవచ్చున్నారు. రైతు వైయస్సార్ రైతు భరోసా పిఎం కిషన్ కింద పెండింగ్లో ఉన్న 38,881 మంది రైతుల ఈకేవైసీని తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతు పొలాల భూసార పరీక్షలను నిర్వహించి శాస్త్రవేత్తల సలహాల మేరకు పంటలు వేసుకుంటే అధిక దిగుబడులు వచ్చే అంశాలను రైతులకు వివరించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ లను వినియోగం లోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని డీఏఓ ను ఆదేశించారు. ఉల్లి ధర మార్కెట్ ధర కంటే తక్కువగా ఉన్నందున ప్రొక్యూర్ మెంట్ కు చర్యలు తీసుకోవాలని మార్క్ఫెడ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే 10 వేల మెట్రిక్ టన్నుల జొన్న, 24 వేల మెట్రిక్ టన్నుల సెనగ పంట లక్ష్యాన్ని కూడా రీచ్ కావాలన్నారు. పెండింగ్ లో ఉన్న మినీ గోకులం షెడ్లను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జెడిని కలెక్టర్ ఆదేశించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రస్తుతం ఉగాది పండుగ సందర్భంగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చెయ్యాలనే ఉద్దేశంతో ఫ్రీ గిఫ్ట్ అంటూ మోసం చేసే అవకాశం ఉందని కాబట్టి ప్రజలు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి ప్రజలను హెచ్చరించారు. ఆశపడి ఆకర్షితులైతే సైబర్ నేరగాళ్ల చేతిలో నిలువుదోపిడికి గురయ్యే అవకాశం ఉందని డబ్బులు పోయాక బాధపడడం కంటే అవగాహనతో వ్యవహరించి జాగ్రత్త పాడాలని యోనో ఎస్బిఐ అకౌంట్ పేరిట చేస్తున్న మోసాల గురించి, పాన్కార్డు నంబర్ అప్డేట్ పేరిట చేస్తున్నమోసాల గురించి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చి సైబర్ నేరగాళ్ల మోసాల బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో ఎస్పీ శుక్రవారం మీడియా ద్వారా తెలిపారు. ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ తెలియని మొబైల్ నంబర్స్ నుండి అకౌంట్ బ్లాకైందని, పాన్కార్డు నంబర్ అప్డేట్ చేసుకొనేందుకు ఈ లింక్ క్లిక్ చేయండి అని సందేశాలు వచ్చినప్పుడు, ఫ్రీ గిఫ్ట్ అంటూ మెసేజ్లు వచ్చిన ఆ మెసేజ్లో ఉన్న లింక్ని క్లిక్ చేసి, మీ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా నంబర్లు, పాస్వార్డులు, ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్లు వాటి సహాయంతో మీ బ్యాంకు ఖాతాలోని సొమ్మును మీకు తెలియకుండానే దొంగిలిస్తారన్నారన్నారు. మీరు సైబర్ మోసానికి గురైనట్లు తెలుసుకొనే సరికి జరగవలిసిన నష్టం జరిగిపోతుందన్నారు. అంతే కాకుండా మీ వ్యక్తిగత సమాచారం వారివద్ద భద్రపరుచుకొని ఇతర నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని హెచ్చ రించారు. కనుక తెలియని మొబైల్ నెంబర్ల నుండి వచ్చే లింక్లను ఎట్టిపరిస్థితులలో క్లిక్ చెయ్యవద్దన్నారు. ఎవరితోనూ మీ వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. అలాగే గూగుల్ నోటిఫికేషన్ ద్వారా వచ్చే క్యాష్ రివార్డులు, స్క్రాచ్ కార్డ్లని నమ్మవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే మీ దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్కి వెళ్ళి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చెయ్యాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybe rcrime. gov.inలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

అపార నష్టం..



- అకాల వర్షాలకు రైతులు కుదేలు
- ఆదుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్

కూలిన భారీ వక్షాలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

చాగలమర్రి : మండలంలో గురువారం అర్ధరాత్రి నుండి శుక్రవారం తెల్లవారుజాము వరకు గాలి,వాన బీభత్సం సృష్టించింది. ప్రధానంగా మండలంలోని నేలంపాడు, పెద్దబోదనం, చిన్నబోధనం, ముత్యాలపాడు, ఎం తాండా,శెట్టివీడు,రాంపల్లె తదితర గ్రామాలలో చేతికొచ్చిన మొక్క జొన్న, కొర్ర,తదితర పైర్లు నేలవాలాయి. గాలి,వాన బీభత్సానికి మునగ, బొప్పాయి తదితర పంటలు నేల కూలీ రైతులకు కోలుకోలేని నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా మొక్క జొన్న,500 ఎకరాలకు పైగా కొర్ర పంటలు దెబ్బ తినడంతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. మండలంలో వర్షానికి దెబ్బ తిన్న పంటలను ఆయా గ్రామాల వ్యవసాయ,ఉధ్యాన సహాయకులు పరిశీలించారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. **ఆళ్లగడ్డ :** ఆళ్లగడ్డ నియోజకవర్గంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షంతో భారీ నష్టం సంభవించింది. రైతులు సాగుచేసిన మొక్కజొన్న, మినుము, కొర్ర, నువ్వులు, వరి తదితర పంటలన్నీ నేలకొరిగాయి. మిర్చి పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాల కాలం నాటి భారీ వృక్షాలు నెలకొరిగాయి. అనేక చోట్ల చెట్ల కొమ్మలు విరిగి కరెంటు తీగలపై పడ్డాయి. దీనికి తోడు అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు గాలివానకు కింద పడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం జరిగింది. వ్యవసాయ శాఖ ఏడి రామ్మోహన్ రెడ్డి, ఏఈ కిశోర్ రెడ్డిలు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కాగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు నీళ్ల కోసం చాలా ఇబ్బందులు పడ్డారు.. పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలు నీరు లేక ఇబ్బంది పడడంతో కమిషనర్ రమేష్ బాబు స్పందించి మున్సిపల్ కార్యాలయ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. మొత్తం మీద నియోజకవర్గంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో ఇటు పంట నష్టం, కొంతమేరకు ఆస్తి నష్టం కూడా జరిగింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తరువాయి 6లో..



ఆళ్లగడ్డ మండలంలో..

నష్ట పరిహారం చెల్లించాలి

- టి. రమేష్ కుమార్ సిపిఎం జిల్లా కార్యదర్శి



నంద్యాల కలెక్టరేట్ : నంద్యాల జిల్లాలో అకాల వర్షాల వల్ల వడగళ్ల వానల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే సర్వే చేసి నష్టపరహారం ఇవ్వాలి. గురువారం కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో ప్రధానంగా మిరప పంట, మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మిరప పంట కోతకొచ్చేటువంటి దశలో వడగళ్ల వానకు కాయలన్నీ రాలిపోయి రైతుల తీవ్రంగా నష్టపోయారు. కోసిన ఎండుమిర్చి కూడా కళ్లాల్లో చాలాచోట్ల తడిసిపోయి కాయ రంగు మారే పరిస్థితి ఏర్పడింది. వెంటనే ప్రభుత్వం మిర్చి రైతులకు నష్టపరి హారాన్ని చెల్లించాలి. పిడుగులతో, వర్షాల వల్ల పెద్ద ఎత్తున గొర్రెలు మేకలు చనిపోయాయి. గొర్రెల పెంపకందారులకు కూడా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి.

మెరుగైన వైద్య సేవలు అందించాం

- ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ రాగానే అధికారులపై చర్యలు
- జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సామూన్





ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నెరవాడ సమీపంలోని ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ తెలిపారు. శుక్రవారం నంద్యాల సర్వజన వైద్యశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను కలెక్టర్ పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురువారం రాత్రి 8-30 గంటల సమయంలో విద్యార్థులు వాంతులు, కడుపునొప్పితో అస్వస్థతకు గురైనట్లు సమాచారం రాగానే రెవెన్యూ, ఆరోగ్య అధికారులను అప్రమత్తం చేసి విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడం జరిగిందన్నారు. ఫుడ్ పాయిజన్ కారణంగా నెరవాడ ఏపీ గిరిజన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు 44 మంది అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం విద్యార్థులం దరూ క్షేమంగా వున్నారని అన్నారు. 31 మంది డిశ్చార్జ్ కాగా, మిగిలిన 13 మంది విద్యార్థులు కూడా శుక్రవారం సాయంత్రం డిశ్చార్జ్ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆహార పదార్థాలు లేదా తాగు నీటి వల్ల అస్వస్థతకు గురయ్యారనే అంశాలపై శాంపిల్స్ను ఫోరెన్సిక్ ల్యాబ్కు పంపామని, రిపోర్టులు రాగానే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు అస్వస్థతకు గురైన విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితులపై బాగోగులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మహబూబ్ బాషా విద్యార్థులకు అందిస్తున్న వైద్య సేవల గురించి కలెక్టర్ కు వివరించారు.



తడిసిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ రాఘవరెడ్డి, తదితరులు

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం


- ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని నరసాపురం ,ఆలమూరు, ఢీ కొట్టాల ,చిన్న కంబలూరు, పెద్ద కంబలూరు ,ఎల్లా వత్తుల, అప్పనపల్లి, శ్రీరంగాపురం, కోటకొండ, తదితర గ్రామాల్లో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, మినుము పంటలను వ్యవసాయ అధికారి బి జ్యోతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆదేశాల మేరకు వడగండ్లతో కూడిన గాలివాన తాకిడికి దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరిగిందన్నారు. రైతులు సాగుచేసినపంటలు ప్రస్తుతము చేతికందే సమయంలో అకాల వర్షాలు కారణంగా తీవ్రంగా నష్టపోయారన్నారు. తడిసిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటల నష్ట వివరాలను అంచనా వేసి నివేదికను వెంటనే ఉన్నతాధికారులకు పంపాలని ఆయన సూచించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పాణ్యం చంద్ర, చిన్న మాధవ గౌడు, పాణ్యం నాగేష్, బాలయ్య, సూలం ప్రభాకర్, రహిమాన్, నరసాపురం లక్ష్మీ నరసింహ రెడ్డి, తదితరులు ఉన్నారు.

గేట్ ఫలితాల్లో ఆత్మకూరు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ఆత్మకూర్



ఆత్మకూరు పట్టణానికి చెందిన గరుడా వశిష్ట గేట్ పరీక్ష ఫలితాల్లో జాతీయ ర్యాంకు 163 సాధించాడు. వశిష్ట ఎల్కెజి నుండి ఏడవ తరగతి వరకు శ్రీ సత్యవాణి విద్యా మందిరంలో, 8 నుంచి 10 వరకు డి పాల్ హైస్కూల్లో తెలుగు మీడియంలో చదివాడు. పదవ తరగతిలో ప్రతిభ అవార్డులు సాధించాడు. ఇంటర్మీడియట్లో రాష్ట్రవ్యాప్తంగా రెండో ర్యాంకు సాధించాడు. ఇంజనీరింగ్ ఎస్వి యూనివర్సిటీ తిరుపతిలో పూర్తిచేసి ఆన్లైన్లో గేట్ కోచింగ్ తీసుకున్నాడు. తండ్రి సుదర్శన్ న్యాయవాది, తల్లి చంద్రిక గృహిణి. వశిష్ట మాట్లాడుతూ తాను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం లక్ష్యంగానే చదివినట్టు తెలిపాడు. ఈ విద్యార్థి విజయం పట్ల తల్లిదండ్రులు ఆత్మకూరు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని స్కానింగ్ సెంటర్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిగితే అలాంటి స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి వెంకటరమణ స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.ఆర్.వెంకటరమణ అధ్యక్షతన తన చాంబర్ నందు పీసీ, పిఎన్డిటి యాక్ట్ జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, స్కానింగ్ కేంద్రాలలో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినట్లైతే సంబంధిత వైద్యాధికారి, చేయించుకున్నటువంటి వ్యక్తులు, ప్రోత్సహించిన వారికి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో నంద్యాల డివిజన్ నందు 6 స్కానింగ్ కేంద్రాలకు కాను ప్రభుత్వ ఆదేశాల మేరకు 3 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కొత్తగా రిజిస్ట్రేషన్, రెనివల్స్ కొరకు అడ్వైసర్ కమిటీ తీర్మానించి డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోపిఎట్ అథారిటీ కమిటీకి పంపారు. ఈ సమావేశంలో డిఐఓ డా. ఓ. ప్రభావతి దేవి, గైనకాలజిస్ట్ డా.అనురాధ, పీడియాట్రీషన్ డా.బి. లలిత, రేడియాలజిస్ట్ డా. గోపాల్, పిపి ఎన్జిఓ తిరుపతి, డా.రాజశేఖర్, పాల్ రాజారావు, రామారావు,డెమో కె.రవీంద్ర నాయక్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి. లక్ష్మణ్, కె. మహమ్మద్ గౌస్ డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాల మునిసిపాలిటిలోని పర్మినెంట్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య, క్లాప్ డ్రైవర్స్ విభాగములలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు కృష్ణయ్య అధ్యక్షత వహించగా సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భాస్కరాచారిలతో పాటు నాయకులు ఆదాము, రామకృష్ణలతో పాటు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డిలకు సమర్పించారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, కే మహమ్మద్ గౌస్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి భాస్కరాచారిలు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని అన్నారు. సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. స్థానిక సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్లో చర్చించాలన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగములోని అర్హత కలిగిన కాంట్రాక్టు కార్మికులందరికి స్కిల్డ్ సెమి స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగములోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులందరికి రూ. 6000 హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించా లన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరలోనే అందిస్తాం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు త్వరలోనే అందించేందుకు ముమ్మర చర్యలు చేపట్టినట్టు కమిషనర్ ఏవి రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం టిడ్కో గృహాల నిర్మాణాలను, అక్కడ జరుగుతున్న పనులను టిడ్కో ఈఈ చంద్రశేఖర్, డిఈఈ గుప్తా, ఏఇఇ నాయక్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, గృహాలకు విద్యుత్ సరఫరా, సిసి రోడ్ల నిర్మాణాలతో పాటు నీటి సరఫరా కోసం ప్రత్యేకించి 12 బోర్ల ఏర్పాట్లు తదితర అంశాలను వారు పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 1392 మంది టిడ్కో గృహ లబ్ధిదారులు ఉన్నారని, అందులో 1200 మంది లబ్ధిదారుల గహాలను రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు.. టిడ్కో గృహాల వద్ద పనులు త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు గృహాలు త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సురేంద్ర , శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి తదితరులు ఉన్నారు.





ఉగాది బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పి

భక్తులకు మెరుగైన సేవలు అందించండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

శ్రీశైల మహాపుణ్యక్షేత్రంలో ఈ నెల 19 నుండి 23 వరకు శ్రీశైలం దేవస్థానం నిర్వహించే ఉగాది ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ దేవస్థాన, జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వైఎస్ఆర్ సెంటినరీ హాలులో ఈ నెల 22వ తేదీ ఉగాది పండుగ దినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలో నిర్వహించే ఉత్సవ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉగాది పండుగ రాష్ట్రస్థాయి పండుగ కాకపోయినప్పటికీ నూతనంగా ఏర్పాటైన నంద్యాల జిల్లాలోని శ్రీశైల పుణ్యక్షేత్రానికి కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి మెరుగైన సేవలు అందించాలని దేవస్థాన, జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నుండి దేవస్థానానికి అవసరమైన సపోర్ట్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే శ్రీశైలంలో 150 మంది పోలీసులను మోహరించామన్నారు. బందోబస్తు విషయంపై కర్ణాటక డిజితో సంప్రదించామని కర్ణాటక నుండి కూడా 300 మంది పోలీసులు బందోబస్తుగా వస్తున్నారని వారితో కలిసి సంయుక్తంగా పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. అన్ని పార్కింగ్ ప్రదేశాలలో కన్నడ మాట్లాడే వ్యక్తులను అనౌన్సర్లుగా ఏర్పాటు చేయాలని దేవస్థాన ఈఓను అదేచించారు. శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న మాట్లాడుతూ గత ఉగాది ఉత్సవాల్లో చేపట్టిన కార్యక్రమాలు, ఈ ఏడాది ఉగాదికి చేపడుతున్న కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా అటవీ శాఖ అధికారి అలెన్ చాలంగ్ టెరాన్ మాట్లాడుతూ ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని ఫారెస్ట్ టోల్గేట్లను 24 గంటలపాటు అనుమతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-మిడుతూరు

ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 21వ తేదీన డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి బి వెంకట శివుడు కోరారు. శుక్రవారం కడుమూరు పీహెచ్ఎస్సిలో డాక్టర్ శివ కుమార్ గౌడ్‌కి పర్మిషన్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి బి వెంకట శివుడు మాట్లాడుతూ నిరంతరం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పనికి తగ్గ వేతనం అందకపోవడం సరైనది కాదన్నారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా, గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ పిహెచ్సి లీడర్ ఏ. సులోచన, అనిత, మండల కమిటీ సభ్యులు, శారద, ప్రభావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గడివేముల : ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 21వ తేదీన డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చెన్నమ్మ అన్నారు. ఈ మేరకు పీహెచ్ఎస్సి లో మెడికల్ ఆఫీసర్‌కి పర్మిషన్ లెటర్ అందజేశారు. అనంతరం చెన్నమ్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రభావతి, మహేశ్వరి, ఆశాబి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



గడివేములలో అధికారికి ఆశాల వినతి

దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న పంటను ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం సాయంత్రం వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. అకాల వర్షానికి రైతన్నలు సాగుచేసిన పంటలు దెబ్బతిన్న విషయం ఎమ్మెల్యేకు తెలిసిన వెంటనే అసెంబ్లీ సమావేశాలలో ఉన్న ఎమ్మెల్యే హుటాహుటిన ఆళ్లగడ్డకు వచ్చారు. పంటలను పరిశీలించి రైతులు ఆందోళన చెందవద్దని, రైతులకు నష్టపరిహారం అందించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. పంట నష్టాన్ని అంచనా వేయాలని ఆయన వ్యవసాయ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ రామ్మోహన్ రెడ్డి, ఏవో కిషోర్ రెడ్డి, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, యాదవాడ నరసింహారెడ్డి, గంగుల రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జెసి నిశాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

క్షేత్రస్థాయిలో మండల సర్వేయర్లు సరిగా కొలతలు వేయడం లేదని, ఏవో కారణాలతో పెండింగ్‌లోలి పెడుతున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సర్వేయర్లు క్రమశిక్షణతో, చిత్తశుద్ధితో పనిచేసి అప్పగించిన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో పిఓఎల్ఆర్ రీ సర్వే, ఫారం-6బి, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవిన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని మండల సర్వేయర్లను, ల్యాండ్ అండ్ సర్వే ఎడి శ్రీరామ్‌ను ఆదేశించారు. సర్వేప్రక్రియలో మండల సర్వేయర్లు అసాధారణ రీతిలో ఆలస్యం చేస్తున్నారని, అనవసరంగా పెండింగ్‌లో పెడుతున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అవినీతికి ఆస్కారం లేకుండా క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. సర్వే పూర్తి అయిన పనులకు వాస్తవ నివేదికలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో హద్దులను గుర్తించి సరిహద్దు రాళ్ళ పాతేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. డివిజన్ స్థాయిలో గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలకు రీ సర్వే ప్రక్రియపై పూర్తిస్థాయి శిక్షణ, అవగాహన ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జేసికి సూచించారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు పోలింగ్ కేంద్రాల వారిగా బూత్ స్థాయి అధికారులకు రోజువారీ లక్ష్యాలను కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రగతి తక్కువగా ఉన్న మండలాలతో ప్రతిరోజు టెలి కాన్ఫరెన్స్ తీసుకోవాలని జెసిని సూచించారు. ఎఫ్‌పిఓఎల్ఆర్ చేపట్టిన సర్వేలో బుధవారంలోగా ప్రగతి చూపాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి మాట్లాడుతూ టాప్-4, టాప్ 10లో వున్న సర్వీసులకు సంబంధించి వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ఎంక్వయిరీ చేసిన రిపోర్టులను తాసిల్దార్లు, ఆర్డీవోలు నిశితంగా పరిశీలించి సిఫారసు చేయాలని ఆమెలి సూచించారు. పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్ల జారీకి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. స్పందన అర్జీల పరిష్కారానికి సంబంధించి తాసిల్దారులు ప్రతిరోజు దృష్టి పెట్టి బియాండ్ ఎస్ఎల్‌ఏలో కి వెళ్లకుండా ఎప్పటికిప్పుడు పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. ఈ సమావే శంలో డిఆర్ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్డీవోలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, ఎం దాసు, అన్ని మండలాల తాసీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జెసి నిశాంతి

ఉగాది మహోత్సవాలకు ఏర్పాట్లు : ఇఒ

ప్రజాశక్తి - శ్రీశైలం

ఈనెల 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు శ్రీశైలం క్షేత్రంలో జరగనున్న ఉగాది మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఇఒ లవన్న శుక్రవారం తెలిపారు. కాలినడక వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులకు మూడు క్యూలైన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్పర్శ దర్శనం పూర్తిగా నిలుపుదల చేయడం జరిగిందని తెలిపారు. అన్న ప్రసాద భవనంలో ఉచితంగా అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్వచ్ఛంద సంస్థలు చేసే అన్నదాన కార్యక్రమానికి దేవస్థానం తరపున అన్ని సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. పలు చోట్ల తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పారిశుద్ధంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. పలు రకాల కన్నడ సంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేసిన్నట్లు తెలిపారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ దేవికి శుక్రవారం నాడు కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమం జరిగింది. చైత్రమాసంలో పౌర్ణమి తర్వాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం భ్రమరాంబ దేవికి కుంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఏప్రిల్ 11వ తేదీన ఈ కుంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. స్త్రీ వేషంలో ఉన్న ఒక పురుషుడు కుంభ హారతి సమర్పించడం ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టం. ఈ కుభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి తర్వాత వచ్చే ప్రతి మంగళవారం శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగానే ఉదయం సంప్రదాయాన్ని అనుసరించి కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించడం జరిగింది.

రాష్ట్ర ఆప్కొ డైరెక్టర్‌గా యల్లా సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణానికి చెందిన యల్లా సుబ్బరాయుడు రాష్ట్ర ఆప్కో డైరెక్టర్‌గా నియామకం అయ్యాడు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డికి సుబ్బరాయుడు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పజెప్పిన బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సుబ్బరాయుడుకు జిల్లా ప్రముఖులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.





తల్లిదండ్రులతో విజయలక్ష్మి

నీట్ పీజీ ఫలితాల్లో విజయలక్ష్మికి ఉత్తమ ర్యాంకు

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

మండలంలోని బిజినవేముల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాదినేని శీలారెడ్డి, సరోజమ్మ గార్ల మనవరాలు విజయలక్ష్మి నీట్ పోస్టుగ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 320వ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీలా రెడ్డి కూతురు పుష్పలతను డోన్ పట్టణానికి చెందిన మినమూరి శేఖర్‌తో వివాహం జరిగిందన్నారు. వారు వ్యాపార నిమిత్తము చీమకుర్తిలో ఉన్నారన్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు వారిలో పెద్ద కుమార్తె విజయలక్ష్మి ఎంసెట్లో సైతం 174వ ర్యాంకు పొందారన్నారు. రెండో కుమార్తె హేమ చైతన్య హౌస్ సర్జన్ గా ఉన్నారన్నారు. ఇద్దరు కుమార్తెలు వైజాగ్‌లో ఉన్న ఆంధ్ర వైద్య కళాశాలలో విద్యను అభ్యసించారన్నారు. ఈ సందర్భంగా బిజినవేముల గ్రామ ప్రజలు మాజీ సర్పంచ్ శీలారెడ్డిని అభినందించారు.

రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్‌కు జిల్లా క్రీడాకారులు ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల

భీమవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో పాల్గొనే కర్నూలు, నంద్యాల జిల్లాల జట్ల ఎంపిక పోటీలను ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ నిర్వహణలో, నంద్యాల రోటరీ క్లబ్ సహకారంతో శుక్రవారం స్థానిక రోటరీ భవన్లో జరిగాయి. ఈ సందర్భంగా ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామ మూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి టోర్నమెంట్ ప్రారంభించారు. డాక్టర్ రవి కృష్ణ, కందుకూరి శ్రీరామ్మూర్తి చెస్ పోటీలో పావులు కదిపి పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి ఎన్ సి మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, చెస్ మాస్టర్ ఇమామ్, టోర్నమెంట్ డైరెక్టర్ సుజాత పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ రవి కృష్ణ, రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామ్మూర్తి మాట్లాడారు. ఈ పోటీలలో 150 మంది చెస్ క్రీడాకారులు జిల్లా వ్యాప్తంగా పాల్గొన్నారు.



చెస్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న రోటరీ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామమూర్తి

నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - మిడుతూరు

భారీ వడగండ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు మద్దిలేటి, వి రమణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు అగ్రికల్చర్ విజయ్ కుమార్, మిడుతూరు ఏఏఓ పీరు నాయక్ ఆర్టికల్చర్ అధికారి తేజస్విని రైతుల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన మిరప రైతులకు ఎకరాకు రూ.మూడు లక్షలు, మొక్కజొన్న రైతులకు ఎకరాకు రెండు లక్షలు చొప్పున నష్టపరిహారం ఇచ్చి తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని అధికారులు తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయం దగ్గర రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు రైతులతో వినతి పత్రం ఇచ్చారు. జలకనూర్ ఎంపీటీసీ హరిషోత్తమ రెడ్డి, రైతులు లింగారెడ్డి, ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, నారాయణ, కిరణ్ ఎల్లా, నాగన్న, శ్రీనివాసులు, శంకర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



రాచర్ల పిల్లల కథా సంకలనానికి ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి -ప్యాపిలి

రాచర్ల విద్యార్థులకు కథా సంకలనానికి ప్రతిభ పురస్కారం రావడం మంచి పరిణామమని ప్రధానోపాధ్యాయులు తొగట సురేష్ బాబు అన్నారు. వారు మాట్లాడుతూ కలనానికి స్వయంగా తమ సృజనాత్మక శక్తికి పదును పెట్టి రచించిన కథల సంకలనం "వెలుతురు చినుకులు" తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్ లోగల డాక్టర్ చింతోజు బ్రహ్మయ్య బాలామణి ఎడ్యుకేషనల్ మెమోరియల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ వారి బాల ప్రతిభా పురస్కారానికి ఎంపీకకావడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. బాలరచయితలకు ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తలిత కుమారి, గోపాల్, సునీల్, జ్యోతి, ప్రేమ్ కుమార్, లక్ష్మనాయక్, శేషయ్య, సుజాత, జీవలత, ప్రకాశా బాబు పాల్గొన్నారు.

పాదయాత్రికులకు అన్నదానం



ప్రజాశక్తి - పాములపాడు

మండల పరిధిలోని ఎర్ర గూడూరు సమీపంలో ఉన్న శ్రీ కాశినాయన ఆశ్రమం వద్ద శ్రీ పారిజాతం అఖిలభారత పూసల శెట్టిబలిజ కృష్ణ బలిజ నిత్య అన్నదాన సేవ సత్రం శ్రీశైలం వారి ఆధ్వర్యంలో కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుండి శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తులకు శుక్రవారం నాడు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. అదేవిధంగా భక్తులకు భక్తులకు ఉచితంగా మెడికల్ క్యాంపు నిర్వహించి మెడిసిన్స్, ఆయింట్మెంట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పంపిణీ కార్యక్రమంలో పారిజాతం అఖిలభారత పూసల శెట్టిబలిజ కృష్ణ, బలిజ సంఘం ప్రెసిడెంట్ నాయిని రామస్వామి, కార్యదర్శి పెద్ద స్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏ రాజశేఖర్, సంఘం వైస్ ప్రెసిడెంట్ రమాపతి, సంఘం కమిటీ సభ్యులు ఐజ పుల్లమరాజు, ఏ. వెంకటేశ్వర్లు, నాయిని మధుసూదన్ రావు, కులయప్ప, వెంకటేశ్వరరావు, రణధీరు, ప్రజాశక్తి డివిజన్ ఇంచార్జి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రికులకు మజ్జిగ పంపిణీ

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి యువసేన ఆధ్వర్యంలో పాములపాడు మండలంలోని జూటూరు సమీపంలో శ్రీశైలంకి వెళ్లే భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో రమేష్ నాయుడు, సింగారం రంగా,తెలుగు నాగరాజు, జగదీష్ గౌడ్, బత్తిని చరణ్ కుమార్, రహమాతుల్లా, మురళి గౌడ్, మూర్తుజవలి, ఆటో వలి, గోకారి, గోపాల్, షాహిద్, పవన్, రాజు,కాశిం వలి పాల్గొన్నారు.





పట్టుబడిన వాహనాల వేలం

ప్రజాశక్తి - అవుకు

అవుకు పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను శుక్రవారం వేలంపాటలను డోన్ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు 13 మోటార్ సైకిళ్ళు, ఒక కారు, ఒక ఆటోను మొత్తం 15 వాహనాలను వేలం పాటలు నిర్వహించగా ఒక లక్ష 580 రూపాయలు మేరా ప్రభుత్వానికి ఆదాయము చేకూరిందని తెలిపారు. ఈ వేలం పాటల్లో అవుకు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, బనగానపల్లె సిఐ సుబ్బరాయుడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె : మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలంపాటల్లో రూ.1,56,520 ఆదాయం వచ్చినట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మద్యం కేసులో పట్టుబడిన వాహనాలను డోన్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ కేసులలో సీజ్ చేసిన 14 బైకులు,02 ఆటోలు, ఒక కారును 21 వాహనాలను వేలం వేశారు. సీఐ సుబ్బరాయుడు, సెబ్ ఎస్సై దౌలత్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

కాటసాని తిరుపాల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

గ్రామంలో అందరూ ఐక్యంగా ఉండి గ్రామ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని అవుకు మండలం లింగం బోడు గ్రామంలో రూ10 లక్షలతో టిటిడి శ్రీవాణి ట్రస్టు నిధుల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న శ్రీరాముల ఆలయ నిర్మాణానికి వైసిపి అవుకు తిరుపాల్ రెడ్డి భూమి పూజ నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలు శాలువా కప్పి పూలమాలతో కాటసాని తిరుపాల్ రెడ్డిని సన్మానించారు. డిఎంఎఫ్ నిధులతో 5 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, త్వరగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను పూర్తి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా కాటసాని తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ లింగంబోడు గ్రామంలో మెట్ట నుండి గ్రామంలోనికి సుమారు కోటి రూపాయల నిధులతో తారు రోడ్డు వేసినట్లు తెలిపారు. గతంలో రోడ్డు సక్రమంగా లేక చిన్న వర్షం పడిన గ్రామానికి రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారిని ఆ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి కావడంతో తారు రోడ్డు వేసినట్లు తెలిపారు. గ్రామంలో పలు కాలనీలలో త్వరలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు పొలాలకు వెళ్లే పొలం రస్తాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు నెలల్లో ఆలయ నిర్మాణం, ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను పూర్తి చేసి బనగానపల్లె, పాణ్యం ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగం బోడు గ్రామ పెద్దలు తిమ్మారెడ్డి, మద్దిలేటి స్వామి, పుల్లారెడ్డి, కేశాలు, రమణయ్య, సంజీవుడు, బాలన్న, పుల్లయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేభా రాణి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని బనగానపల్లె ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ ఉమామహేశ్వరమ్మ కు అంగన్వాడీ వర్కర్లు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా షేభారాణి మాట్లాడుతూ అంగన్వాడీలకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారము అంగన్వాడి వర్కర్లకు, హెల్పర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. రిటైర్డ్ అయిన అంగన్వాడి వర్కర్లకు, హెల్పర్లకు వేతనంలో 50 శాతం పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రోజా, రమణి తదితరులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** బేతంచర్ల మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామం లో గల అంగన్వాడి సెంటర్లు కు మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు మండల కార్యదర్శి రహంతుల్లా అన్నారు. ఈ సందర్భంగా రహంతుల్లా మాట్లాడుతూ వంట సదుపాయాలకు, బాత్రూములకు నీటి సదుపాయం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంగన్వాడి సెంటర్ సమీపంలో చేతి పంపు చెడిపోయి రెండు సంవత్సరాలు పైనే అవుతుందని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన అన్నారు.



సిడిపిఓకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడి వర్కర్స్ యూనియన్ సభ్యులు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆళ్లగడ్డ బిజెపి ఇంచార్జి భూమా కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని భూమా కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను భూమా కిషోర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వర్షం కురవడంతో 600 గొర్రెలు మృతి చెందాయని, వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్వాయి పల్లె, కొండుపల్లె, ఇంజెడు గ్రామాలు, ఆళ్లగడ్డ మండలం లోని చిన్న కందుకూరు, లింగం దీన్నే గ్రామాల్లోని నీట మునిగిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించి, రైతులకు నష్టపరిహారం అందజేసి వారిని ఆదుకోవాలని కోరారు. **ఆళ్లగడ్డ:** ఆళ్లగడ్డ నియోజకవర్గం లో అకాల వర్షంతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని తాలూకా బిజెపి బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని చిన్న కందుకూరు, లింగందిన్నె, సర్వాయిపల్లె, కొండంపల్లి, ఇంజేడు గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట అంబటి మహేశ్వర్ రెడ్డి, సర్వేపల్లి రాజా తదితరులు ఉన్నారు.



అపార నష్టం..

5వపేజీ తరువాయి

ఉయ్యాలవాడ: మండలంలో మిరప, మొక్కజొన్న, వరి, పత్తి పంటలు తడిసి ముద్దయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ నిలిచిపోయింది. **రుద్రవరం :** మండలంలో గాలి వాన బీభత్సానికి రైతులు సాగు చేసినపంటలు నేలమట్టం అయ్యాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎల్లా వత్తుల గ్రామంలో ఇతర గ్రామాల నుంచి మేతకు వచ్చిన 50 గొర్రెలు వడగండ్ల తాకిడికి మృత్యువాత పడ్డాయి. పంటలు దెబ్బతిన్న గ్రామాలను మండల వ్యవసాయ అధికారి జ్యోతి సిబ్బందితో కలిసి పరిశీలించారు. నివేదికను అధికారులకు అందజేస్తామని ఆమె తెలిపారు.



సంజామల మండలంలో

సంజామల : మండలంలో 650 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. రైతుల వివరాలను సేకరించి ప్రతిపాదన పంపించినట్లు ఆయన తెలిపారు. **కోవెలకుంట్ల :** కోయిలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్లో మొక్కజొన్న , మిరప, వరి పంటలు దెబ్బతిన్నాయి. ప్రాథమిక నివేదికలను ప్రభుత్వానికి అందిస్తున్నట్లు తెలిపారు.



రుద్రవరం మండలంలో



కోవెలకుంట్ల మండలంలో

రైతాంగాన్ని ఆదుకోండి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు

చాగలమర్రి : లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, కొద్ది రోజుల్లోనే పంట చేతికి వచ్చి అప్పులు తీరుస్తామని ఆశలు పెట్టుకున్న రైతాంగానికి అకాల వర్షం తీవ్రమైన నష్టాన్ని, నిరాశను మిగిల్చింది. నష్టపోయిన రైతులకు రబీపంట రుణాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



ఆళ్లగడ్డలో..

సిరివెళ్లలో..

